

గట్టులో పూజలందుకుంటున్న గణేషుడు

విఘ్నరాజాయ.. వినాయకాయ నమః 4

కొనసాగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు

- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు 5

రిజర్వాయర్‌లో గల్లంతైన భార్యాభర్తలు మృతి

కృష్ణా బేసిన్‌కు.. వరద జోరు

- ఈ ఏడాది మే నెలలోనే ప్రాజెక్టులకు వరద
- శ్రీశైలం ప్రాజెక్టుకు ఇప్పటివరకు 1,313 టీఎంసీల వరద రాక
- 780 టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లిన పరిస్థితి
- కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లు అత్యధిక రోజులు బంద్



నిండుకుండలా ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అల్మట్టి మొదలుకొని పులిచింతల వరకు ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. కృష్ణా బేసిన్ చరిత్రలో ఒక వాటర్ సీజన్ ముగియకముందే వరద ఈ సంవత్సరం మే నెలలోనే ప్రారంభం కాగా ఇంకా భారీ వరదలు నమోదవుతూనే ఉన్నాయి. కృష్ణా నదికి సాధారణ వరద రోజులు 90 కాగా ఈ సంవత్సరం వాటర్ ఈయర్‌లో ఇప్పటికే 96 రోజులపాటు వరద వచ్చింది. సెప్టెంబరు నెలాఖరు లేదా అక్టోబరు మొదటి వారం వరకు వరద ఇలాగే కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కృష్ణా బేసిన్ ప్రాజెక్టులన్నింటిలో కలిపి 926.52 టీఎంసీల నీరు నిల్వఉండగా వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువ ప్రాజెక్టులకు వదులుతున్నారు. ఒక్క తుంగభద్ర ప్రాజెక్టు మినహా మిగతా అన్ని ప్రాజెక్టుల్లో దాదాపు పూర్తిస్థాయి నిల్వలు ఉన్నాయి. తుంగభద్ర ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 105.79 టీఎంసీలు కాగా 78.77 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఈ సీజన్‌లో ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపలేదు. గతేడాది ఒక స్పిల్‌వే గేటు కొట్టుకుపోవడంతో స్టాప్ లాక్‌ను అమర్చిన విషయం తెలిసిందే. అందుకే ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపడం లేదని తెలుస్తోంది. కాగా తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు ఈ సీజన్‌లో ఇప్పటివరకు 1313 టీఎంసీల వరద వచ్చి చేరింది. 2009 తర్వాత ప్రస్తుత సమయానికి ఇంత వరద రావడం ఇదే మొదటిసారి.

780 టీఎంసీలు సముద్రంలోకే...

ఈ ఏడాది కృష్ణా బేసిన్‌కు ముందుగానే వరదలు ప్రారంభం కాగా రికార్డు స్థాయిలో ప్రాజెక్టుల్లో నిల్వలు ఉన్నాయి. మరో నెలరోజులపాటు వరద కొనసాగే అవకాశం ఉంది. అయితే బేసిన్‌లోని

(మిగతా 4లో..)



అధికారుల తప్పిదంతోనే.. యూరియా తిప్పలు

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

కొల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి ఎంత యూరియా అవసరమో అంచనా వేయడంలో అధికారులు విఫలమైనందున రైతులు అవస్థలకు గురవుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. గురువారం కొల్లాపూర్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో యూరియా కోసం సింగిల్‌విండో సొసైటీ ముందు ధర్నా నిర్వహించారు శ్రీనివాసులు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి సరైన సమయంలో యూరియా అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ధ్వజమెత్తారు. యూరియా అందుబాటులో ఉంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీర్, రైతులు వెంకటస్వామి, మల్లయ్య, రాముడు, ఎల్లయ్య, రాజు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా

- యువకుడి మృతి, పలువురికి గాయాలు
- గణేషుడిని నిమజ్జనం చేసేందుకు వెళ్తుండగా ఘటన

5

మోగని గుడి గంటలు

- పునరావాస కేంద్రాల్లో ఆలయాలు కరువు
- నిధులున్నా ప్రారంభం కాని నిర్మాణం
- శుభకార్యాలు, పెళ్లిళ్లకూ అవస్థలు
- ఆవేదన చెందుతున్న స్థానికులు

4

కరెంట్ షాక్‌తో రైతు మృతి



ఉత్పత్తి వివరాలను పరిశీలిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్

జల విద్యుత్ ఉత్పత్తి వేగం పెంచాలి

- జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ ఉత్పత్తి కేంద్రాలను తనిఖీ చేసిన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్

ఆత్మకూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టుకు వరద ఆశించిన మేర వస్తున్న కారణంగా ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి వేగం పెంచాలని జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ పేర్కొన్నారు. గురువారం ప్రియదర్శిని ప్రాజెక్టు ఎగువ, దిగువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల డైరెక్టర్ బాలరాజు, ఎగువ దిగువ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్‌తో కలిసి పర్యటించారు. అనంతరం మాట్లాడారు. ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లోని 12 యూనిట్లను పరిశీలించారు. ఈ ఏడాది ముందుగానే వరద వచ్చిన కారణంగా నిర్దేశించిన లక్ష్యానికి మించి ఉత్పత్తి చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం దిగువ జూరాల పరిసర ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించారు. అందుకు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీధర్, అధి కారులు సోలార్ ప్లాంట్‌కు కావాల్సిన 100 ఎకరాల స్థలం ఇది వరకే సేకరించారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఎస్ఈఈ సురేశ్‌తో పాటు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల డీఈలు, ఏడీలు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

- సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
-మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అట్టడుగు వర్గాలకు కూడా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నదని చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవానికి ఒక రోజు ముందు గురువారం జిల్లా కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని ఆయన చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని సమాజ నిర్మాణానికి టీచర్లు పునాది రాళ్లని చెప్పారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా రంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తు చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మెరుగైన విద్యనందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మిస్తుండడం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీఈవో రమేశ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు శోభారాణి, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సిద్ధం చేయాలి

రేపు ప్రారంభించనున్న గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి : కలెక్టర్


గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేపు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించేందుకు వస్తున్నందున అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎంపికైనా లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పట్టాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇళ్లు మంజూరైన 715 కుటుంబాల సభ్యులు కార్యక్రమానికి హాజరు అయ్యేలా మునిసిపల్ కమిషనర్ సమన్వయం చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో అలివేలు, డీపీవో నాగేంద్రం, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గడువు ముగిసిన మందు గోలీలు సరఫరా

- డాక్టర్, ఫార్మసిస్టుకు నోటీసులు జారీ చేసిన జిల్లా వైద్యాధికారి



అయిజ ఆస్పత్రిలో అందించిన గడువు ముగిసిన టాబ్లెట్లు

అయిజ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ ప్రభుత్వ ఆస్పత్రిలో గడువు ముగిసిన మందు గోలీలు ఇచ్చిన ఇద్దరికి నోటీసులు జారీ చేశారు. అయిజ పట్టణానికి చెందిన చిట్టెమ్మను 3వ తేదీ బుధవారం కోతి కరిసింది. దివ్యాంగురాలైన ఆ యువతీ అయిజ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లింది. పరిక్షించిన వైద్యులు ఆమెకు మందుగోలీలు రాశారు. ఆస్పత్రిలోనే గోలీలు తీసుకుంటే ఈ ఏడాది జూలై 2025 గడువు ఉన్న గోలీలను అందించారు. ఇంటికి వచ్చిన ఆమె రాత్రి గోలీలు వేసుకునే ముందు తెలిసిన వారికి చూపించింది. కాలం చెల్లిన గోలీలుగా వారు గుర్తించి వేసుకోవద్దని సూచించారు. ఈ విషయాన్ని స్థానికులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జిల్లా వైద్యాధికారి సిద్దప్ప గడువు ముగిసిన మందుగోలీలు ఇచ్చిన అయిజ ప్రభుత్వ వైద్యాధికారి కిరణ్, ఫార్మసిస్టు అమృతరాజులను వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

అవసరం మేరకే యూరియా తీసుకోవాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో యూరియా కొరత లేదని రైతులు ప్రస్తుత అవసరా ల మేరకు తీసుకోవాలి అని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం వనపర్తి మండలం పెద్దగూడెం పీఏసీ ఎస్ గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. పీఏ సీఎస్ చైర్మన్లు సకాలంలో యూరియా కోసం డీడీలు కట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడే రైతుల తో మాట్లాడారు. ఇంకా ఒక లోడ్ యూరియా తెప్పిస్తే ఈ ప్రాంతం లో అందరికీ సరిపోతుందని సూచించారు. వనపర్తి జిల్లాలో గతేడాదికంటే ఎక్కువ యూరియా వచ్చిందని, పాత నిల్వలు సైతం ఉన్నాయన్నారు. కేవలం మళ్లీ యూరియా దొరకుతుందో లేదో అని రైతులు ప్రస్తుత అవసరానికి మించి కొనడం వల్ల ఇతర రైతులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. మలి దఫా వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవడం సరి కాదన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.



పెద్దగూడెంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్






విఘ్నరాజాయ.. వినాయకాయ నమః

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వినాయక ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. గత నెల 27న మండపాల్లో కొలువు దీరిన గణనాథులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో నిమజ్జనం ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో గణనాథుల నిమజ్జనం ఇప్పటికే ప్రారంభమైంది.

- నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)



నాగర్‌కర్నూల్‌లో రాంనగర్‌కాలనీలో ఫ్రెండ్స్ యూత్ వినాయకుడు



కొత్తకోట దండుగడ్డ కాలనీలో కొలువైన గణనాథుడు



నారాయణపేటలో ఛత్రపతి శివాజీ అలంకరణలో ముదిరాజ్ సంఘం ప్రతిష్ఠించిన వినాయకుడు



నారాయణపేట అంబేద్కర్ చౌరస్తాలో అయ్యప్ప స్వామి అలంకరణలో కొలువుదీరిన గణపతి



నాగర్‌కర్నూల్‌లోని రాఘవేంద్రకాలనీలో నిమజ్జనానికి తరలుతున్న వివేకనంద యూత్ వినాయకుడు



దేశాయిపల్లిలో త్రిశూల ధారిగా భక్తుల పూజలందుకున్న వినాయకుడు

మార్వాడీల మోసాలను అడ్డుకోవాలి

» మార్వాడీ గోబ్యాక్ తెలంగాణ బచావో మూమెంట్ అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పిడమర్తి రవి

పాలమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో మార్వాడీలు చేస్తున్న మోసాలను అడ్డుకోవాలని మార్వాడీ గోబ్యాక్ తెలంగాణ బచావో మూమెంట్ అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి ప్రజలకు పిలుపునిచ్చారు. గురు వారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మార్వాడీలు కొత్త షాపులు పెట్టరాదని మహబూబ్‌నగర్‌లోని వ్యాపారస్థులు అందరు కలిసికట్టుగా ఉండి మార్వాడీల మోసాలను అడ్డుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎదిరె ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ కట్టకుండా నకిలీ వస్తువులు విక్రయించే మార్వాడీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మార్వాడీల దౌర్జన్యాలపైన పోరాటం చేయాలన్నారు. సమావేశంలో గుడిపల్లి రహీం, బొర్ర సురేష్, వ్యాపారస్థులు నక్క మహేష్, మల్లేష్, అశోక్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది గోపాలకృష్ణ, రామలింగం, దేవన్న, జయశంకర్, కృష్ణ, దినేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

● డీఆర్‌డీవో అడిషనల్ పీడీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ శ్రీనివాస్

గట్టు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతానికి సంఘం సభ్యులు కృషి చేయాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ శ్రీనివాస్ అన్నారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులోని ఐకేపీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి అడిషనల్ పీడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు పీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్న వారికి గొర్రెలు, గేదెల పంపిణీ, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఎంఎంఎస్ కార్యవర్గ సభ్యురాలు వెంకటేశ్వరి, అక్షర ఇన్‌చార్జి ఏపీఎం జయకర్, సీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, జ్యోతి, దేవదాస్, శివకుమార్ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో పతకాలు సాధించాలి



యోగా క్రీడాకారులతో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. నిర్మల్ జిల్లాలో నేటి నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న 6వ రాష్ట్రస్థాయి యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు అస్మితయాదవ్, కవిత, సుప్రజ, కావ్య, కీర్తనరెడ్డి, సృజన, శ్రీనిద, సాయిచరణ్, విఘ్నేష్ చరణ్‌తేజ్, శ్రీగణేష్‌ను గురువారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్పీ వెంకటేష్, డీవైఎస్‌వో శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాలో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సురేశ్ పాల్గొన్నారు.

పీయూలో ముగిసిన క్రీడా పోటీలు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. చివరి రోజు పురుషులకు క్రికెట్, వాలీ బాల్, స్త్రీలకు వాలీబాల్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు ప్రారంభించారు. విజేతలకు ఈ నెల 8న పీయూలో నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందించనున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ధరూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని నీలహళ్లి గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండ శ్రీహరి కథనం ప్రకారం.. కేటిదొడ్డి మండలం పాతపాళెం గ్రామానికి చెందిన చాంద్ పాషా(56) తన భార్య రసూల్‌బీతో కలిసి గురువారం ఉదయం నీలహళ్లి గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలానికి వెళ్లారు. వరి చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లగా సమీపంలో ఉన్న విద్యుత్ మోటారు ఆన్‌చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. గమనించిన భార్య చుట్టుపక్కల వారిని పిలవగా, వచ్చి చూసేలోపు అప్పటికే మృతిచెందాడు. విషయం తెలియడంతో ధరూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భార్య రసూల్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కృష్ణయ్య (ఫైల్)

కోస్గి రూరల్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గుండుమాల్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకొంది. కోస్గి ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుండుమాల్ చెందిన పాతరి కృష్ణయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆగస్టు 29న భార్యతో మద్యానికి డబ్బులు ఇవ్వమని అడుగగా ఆమె నిరాకరించింది. దీంతో పొలం వద్దకు వెళ్లి అక్కడున్న పురుగుల మందును తాగాడు. విషయం తెలుసుకున్న భార్య, బంధువులు అతన్ని కోస్గి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్ నగర్ ఆసుపత్రికి అటునుంచి హైదరాబాద్ తీసుకెళ్లారు. బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసి స్వగ్రామం గుండుమాల్‌కు వచ్చారు. గురువారం పరిస్థితి విషమించడంతో వైద్యం కోసం వికారాబాద్ ఆసుపత్రికి తరలించే క్రమంలో పాతరి కృష్ణయ్య(50) మృతి చెందాడు. భార్య పాతరి కేశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమరచింతలో మళ్లీ బారులు తీరిన రైతులు



నిరసన తెలుపుతున్న మహిళలకు నచ్చజెప్పుతున్న పోలీసులు



స్పృహతప్పి పడిపోయిన మహిళను పరామర్శిస్తున్న నాయకులు

అమరచింత, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా కోసం అమరచింతలో బుధవారం మళ్లీ బారులు తీరారు. రెండు రోజుల క్రితం టోకెన్లు పొందిన రైతులు యూరియా కోసం బారులు తీరగా.. మళ్లీ టోకెన్ల జారీ చేస్తారని ఆయా గ్రామాల రైతులు అదే రైతు సేవ కేంద్రం ముందు భారీగా తరలివచ్చి నిలిచి ఉన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు తరలి రావడంతో ఘర్షణ జరిగే అవకాశం ఉందని ఎస్‌ఐ స్వాతి సంఘటన స్థలానికి చేరుకొని రైతులందరిని క్యూలైన్లో నిలబెట్టి టోకెన్లను అందించారు.

రోడ్డుపై బైఠాయించిన మహిళలు

టోకెన్ల జారీలో వివక్ష చూపుతున్నారని, రోజూ తిరుగుతున్నా.. అధికారులు టోకెన్లు ఇవ్వడం లేదని అమరచింత మండలం, సింగంపేట మాజీ సర్పంచ్ విజయలక్ష్మి కొంతమంది మహిళా రైతులతో కలిసి అమరచింత, మరికల్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఆమె తమకు న్యాయం జరగాలని గట్టిగా నినాదాలు చేస్తూ రోడ్డు పైనే కూర్చున్నారు.

ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకులు అధికారులు ఆమెను నచ్చజెప్పి నిరసనను ఆపేలా చేశారు.

యూరియా కోసం వచ్చి.. స్పృహతప్పి పడిపోయిన మహిళ

మరికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు గ్రామానికి చెందిన మణెమ్మ గురువారం ఉదయం 8 గంటలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడింది. ఉదయం నుంచి ఎలాంటి ఆహారం తీసుకోకుండా గంటల తరబడి ఉంది. యూరియా కోసం అనేక మంది రైతులు 10 గంటలకు పెద్ద ఎత్తున రావడంతో తొక్కిసలాటలో మణెమ్మ స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే అక్కడ ఉన్న రైతులు 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడిన కేవలం ఒక బస్తా మాత్రమే రైతులకు అందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అస్వస్థకు గురైన మహిళను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, చంద్రశేఖర్, వీరబసంతు, మతిన్, రామస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనతో జీవితంలో మార్పు

» రెండో రోజు ఉపవాస ప్రార్థనలో డాక్టర్ థెరిస్సాపాల్



ఉపవాస ప్రార్థనలో ప్రసంగిస్తున్న డాక్టర్ థెరిస్సాపాల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీరోజు దేవుడిని ప్రార్థిస్తే మన జీవితంలో గొప్ప మార్పు వస్తుందని అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకురాలు డాక్టర్ థెరిస్సాపాల్ అన్నారు. రెమా వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉపవాస ప్రార్థన పండుగలు రెండోరోజు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ ప్రతీ రోజు ఏకాగ్రతతో మొదటి గడియలో దేవునితో ప్రార్థన పరంగా మాట్లడగలిగితే మనం జీవితంలో ఎప్పుడు చూడని మార్పును చూడవచ్చున్నారు. ఉపవాస ప్రార్థనలలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొనడం సంతోషకరమన్నారు. అందుకు కృషి చేసిన పాస్టర్ బీఎస్ పరంజ్యోతిని ఆమె అభినందించారు. పాస్టర్లు డాక్టర్ కేవి పాల్, జోయల్‌బాబు, యేసుపాదం, సుందర్‌పాల్, వేదాంతిబాబు, తిమోతి, నాగరాజు, ఐజక్, మార్టిన్, మానోక్‌తో పాటు సంఘ పెద్దలు లక్ష్మన్న, దేవయ్య, వడ్డేపల్లి రాజు, శ్యామ్‌సుందర్, గోపాల్ పాల్గొన్నారు.

కృష్ణా బేసిన్‌కు వరద జోరు

(3వ పేజీ తరువాయి)

ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకోవడానికి సరిపడా వ్యవస్థ లేకపోవడంతో ఈ ఏడాది ఇప్పటివరకు 780 టీఎంసీల వరకు నీరు వృథాగా సముద్రంలోకి కలిసిపోయింది. సీజన్ ముగిసేనాటికి వెయ్యి టీఎంసీల నీరు సముద్రంలో కలిసే పరిస్థితి ఉంది. ఈ ఏడాది ఆల్మట్టికి 629 టీఎంసీల నీరు రాగా, దాని దిగువన ఉన్న నారాయణపూర్‌కు 579 టీఎంసీల నీరు వచ్చింది. భీమా నదిపై ఉన్న ఉజ్జయినికి 131.03 టీఎంసీల నీరు రాగా జూరాలకు 894.06 టీఎంసీల నీరు వచ్చింది. తుంగభద్రకు 327.17 టీఎంసీల నీరు రాగా శ్రీశైలానికి 1313.07 టీఎంసీల నీరు వచ్చింది. నాగార్జునసాగర్‌కు 896.99 టీఎంసీలు, పులిచింతలకు 659.88 టీఎంసీలు, కృష్ణా డెల్టా సిస్టమ్‌కు 790.63 టీఎంసీల నీరు వచ్చింది. ఇందులో 780 టీఎంసీలు సముద్రంలోకి వెళ్లింది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లు ఎప్పుడూ నిలుపుదలలోనే ఉంటున్నాయి. ఇందులో ఐదు మోటార్లు ఉండగా ఒక మోటార్ పూర్తిగా పనిచేయడం లేదు. ఒక్కో మోటార్ 800 క్యూసెక్కుల సామర్థ్యం ఉండగా అత్యధిక సందర్భాల్లో రెండు మోటార్ల ద్వారా 1600 క్యూసెక్కుల చొప్పున, కొన్ని సందర్భాల్లో మూడు మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల చొప్పున లిఫ్టు చేశారు. కానీ స్థానికంగా కురిసిన వర్షాలకే చెరువులన్నీ పూర్తిగా నిండిపోవడంతో నీటినిల్వ సామర్థ్యం లేకపోవడంతో మోటార్లు ఆపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద వస్తున్నా నీటిని వినియోగించుకోలేకపోవడంతో యాసంగిలో రైతులకు ఇబ్బందులు తప్పవనే సంకేతాలు వెలువడుతున్నాయి. యాసంగి సీజన్ వచ్చేనాటికి తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగుకు నీటిని విడుదల చేయరు. నీటినిల్వ సామర్థ్యం పెంచుకోకుంటే కల్వకుర్తి కింద ఏటా ఇదే దుస్థితి నెలకొనే పరిస్థితి ఉంది.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

» 1.76 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» 3 గేట్ల ద్వారా 82,710 క్యూసెక్కులు విడుదల

గద్వాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. గురువారం ప్రాజెక్టులోకి 1.76 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. మూడు గేట్ల ద్వారా 82,710 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,327 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 209.15 టీఎంసీలు ని ల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 75 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 52 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 62 వేల క్యూసెక్కలు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 32 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తుంది. ప్రస్తుతం జూరాలకు 92 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 8 గేట్లను ఎత్తి 55,928 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40,324 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 72 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 67 వేల క్యూసెక్కులను శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పాలమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఆహార ధాన్యాల పంటలకు ఎకరానికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. భారీ వర్షాల వల్ల సుమారు రూ.5,435 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. చిన్ననీటి వనరుకుల దాదాపు రూ.629 కోట్లు నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. సుమారు 2.5 లక్షల ఎకరాల్లో వరద ముంపునకు గురైనట్లు ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. క్షేత్రస్థాయిలో అంతకు రెండింతలు నష్టం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేసి కేంద్రంపై ఒత్తిడి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎరువుల కొరత నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఉందని, తక్షణం యూరియా పంపాలని కేంద్రాన్ని కోరారు. పత్తి క్వింటాలుకు రూ.10,075 నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, మోహన్, హన్మంతు పాల్గొన్నారు.

ఇంటి తాళం విరగ్గొట్టి దొంగతనం

» 12 తులాల బంగారం, 90 తులాల వెండి చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు తిరిగి వచ్చే సరికి ఇల్లు గుల్లయ్యింది. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్‌లో ఈ సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాలం బాలమ్మ బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి నాగర్‌కర్నూల్ పట్టణంలోని తమ బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. గురువారం తిరిగి వచ్చే సరికి తాళం విరిగిపోయి కనిపించింది.

లోపలికి వెళ్లి పరిశీలించగా 12 తులాల బంగారు ఆభరణాలు, 90 తులాల వెండి వస్తువులతో పాటు రూ. 11,800 చోరీకి గురైనట్లు గుర్తించింది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాలమ్మ తెలిపింది.

మోగని గుడి గంటలు

» పునరావాస కేంద్రాల్లో ఆలయాలు కరువు

» నిధులున్నా ప్రారంభం కాని నిర్మాణం

» శుభకార్యాలు, పెళ్లిళ్లకూ అవస్థలు

» ఆవేదన చెందుతున్న స్థానికులు



ఆలూరులో దేవుళ్ల విగ్రహాలను ప్రతిష్ఠించిన రేకుల గుడిసె

గట్టు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పునరావాస కేంద్రాల ఆలయాల నిర్మాణంపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ విషయాన్ని పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిధులున్నా ఆలయాలను నిర్మించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెట్టంపాడు ప్రాజెక్టు నిర్మాణంలో ఆలూరు చిన్నోనిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం ఆ రెండు గ్రామాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ ఆయా కేంద్రాల్లో ఆలయాలు నిర్మించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే శుభకార్యాలు, పెళ్లిళ్లు జరుపుకునేందుకూ సరైన స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. ఫంక్షన్ హాల్‌లో వేడుకలు జరుపుకోవా లంటే ఆర్థికభారం అవుతుందని చెప్తున్నారు. అయితే ఆలూరులో ఓ గుడిసె ఏర్పాటు చేసి అందులోనే దేవుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. చిన్నోనిపల్లిలో అది కూడా లేకపోయింది.

అందుబాటులో రూ.50 లక్షలు

ఆలూరు పునరావాస కేంద్రం ఏర్పాటు సమయంలో ముంపు బాధితులకు పరిహారంతో పాటు ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 28 లక్షలు మంజూరయ్యాయి. ఆ డబ్బులు బ్యాంకులోనే ఉండటంతో ప్రస్తుతం రూ.50 లక్షల వరకు చేరాయి. నిధులు అందుబాటులో ఉన్నా, ఏళ్లు గడుస్తున్నా ఆలయాల నిర్మాణం మాత్రం చేపట్టడం లేదు. అయితే ఆలయాల నిర్మాణం కోసం రెండు నెలల క్రితం ప్రభుత్వం టెండర్లను పిలిచి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. కానీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. చిన్నోనిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంతో పాటు మారెమ్మవ్వ గుడి, బడేసాబు దర్గాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. గ్రామస్థులకు ఇళ్ల పరిహారం అందించినప్పుడే ఆలయాల నిర్మాణానికి కూడా నిధులు ఇవ్వాల్సి ఉండింది. కానీ సంబంధిత అధికారులు ప్రతిపాదనలు చేయకపోవడంతో పెండింగ్‌లో పడింది. ప్రస్తుతం నిధుల మంజూరు కోసం భూసేకరణ అధికారులు అవార్డును సిద్ధం చేస్తున్నారు.

ఆలూర్‌లో ప్లాట్ల వివాదం

ఆలూరు పునరావాస కేంద్రంలో ఆలయాన్ని నిర్మించాల్సిన స్థలంలో రేకుల కప్పుతో గుడిసె ఏర్పాటు చేసి, ఆంజనేయస్వామి, శివుడు, వాల్మీకి, కనకదాసుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఇక్కడ ఆలయం నిర్మాణానికి 6 ప్లాట్లను కేటాయించారు. అయితే జాతరలు, వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా ఖాళీ స్థలం ఉండాలని కొందరు గ్రామస్థులు పట్టుబట్టారు. మరి కొందరేమో ఆలయానికి 6 ప్లాట్లు సరిపోతాయని చెప్తున్నారు. లోతట్టు ప్రాంతంలో, నిర్మాణాలకు అనువుగా లేని చోట ప్లాట్లు ఇచ్చిన వారికి మిగిలిన స్థలంలో ప్లాట్లు కేటాయించాలని కోరుతున్నారు. ఈ వివాదంతో ఆలయ నిర్మాణం కొల్లిక్కి రావడం లేదు.

ఆలయాల నిర్మాణానికి చర్యలు



ఆలూరు పునరావాస కేంద్రాల్లో ఆలయాల నిర్మాణం కోసం నిధులు సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. చిన్నోనిపల్లి పునరావా కేంద్రంలో ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి, ప్రభుత్వానికి పంపిస్తాం. నిధులు మంజూరైన తర్వాత నిర్మాణం చేపడతాం.

- లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

పూజలకు నోచుకోలేక పోతున్నాం



ఆలయాలు నిర్మించక పోవడంతో పూజలు చేసుకోలేకపోతున్నాం. ముంపు గ్రామంలో ఆంజనేయుడు, శివుడు, మారెమ్మవ్వ ఆలయాలుండేవి. వాటితో పాటు బడేసాబు దర్గా కూడా ఉండేది. ఆ ఆలయాలను పునరావాస కేంద్రంలో నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజరు చేయలేదు. అధికారులు స్పందించి ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- కుర్వ వీరేష్, చిన్నోనిపల్లి పునరావాస కేంద్రం

క్రైం కార్నర్

శ్రీశైలం ఘాట్ రోడ్డులో

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

- యువకుడి మృతి, పలువురికి గాయాలు
- వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు వెళుతుండగా ఘటన



శ్రీశైలం ఘాట్ రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్

బ్రహ్మగిరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు శ్రీశైలం వెళుతుండగా నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లికి నాలుగు కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి రసమోళ్లబావి దగ్గర చోటు చేసుకుంది. బ్రహ్మగిరి ఎస్‌ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన 10 మంది శ్రీశైలం కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు బుధవారం రాత్రి 11 గంటలకు ట్రాక్టర్‌లో బయదేరారు. మన్ననూర్ వరకు 2 గంటలవరకు రావడంతో ఫారెస్ట్ చెక్‌పోస్టు గేటు మూసివేయడంతో ఆ రాత్రి అక్కడే పెట్రోల్ బంక్ దగ్గర యువకులు నిద్రించి గురువారం ఉదయం శ్రీశైలానికి బయలుదేరారు.

వటువర్లపల్లి సమీపంలో ఘాట్ రోడ్డులో డ్రైవర్ కాలిన శ్రీను టాక్టర్ వేగంగా నడుపడంతో అదుపు తప్పి బోల్తా పడటంతో కాలిన మహేశ్‌కు (21) తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో చికిత్స కోసం అచ్చంపేటకు తరలిస్తుండగా మహేశ్ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో జెల్లి శివప్రసాద్ (20), జెల్లి యశ్వంత్ (21), అండి కార్తీక్ (20), పానిపల్లి ధనుంజయ్ (21)కు స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. మృతుని తండ్రి శివనాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ పేర్కోన్నారు.

కంటైనర్, కారు ఢీకొని..



జడ్చర్ల ఫ్లైఓవర్‌పై కంటైనర్, కారు ఢీ కొన్న సంఘటనలో మృతి చెందిన రోహిత్

జడ్చర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్, కారు 44వ నెంబరు జాతీయరహదారి జడ్చర్ల ఫ్లైఓవర్‌పై గురువారం ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన రోహిత్, అహ్మన్, ప్యాట్రిక్స్‌లు స్నేహితులు. వీరు ముగ్గురు కలిసి తమిళనాడులోని కొడైకెనాల్‌కు టూర్ వెళ్లారు. తిరిగి వస్తుండగా జడ్చర్ల ఫ్లై ఓవర్ వద్ద ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఇరుక్కుపోయి రోహిత్(30) అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న అహ్మన్, ప్యాట్రిక్స్‌కు గాయాలయ్యాయి. విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి జడ్చర్ల సీఐ కమలాకర్, ఎస్‌ఐ జయప్రసాద్‌లు చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుత్ వైరు

- రెండు రోజులుగా పంట చేల్లోనే మృతదేహం

నవాబ్‌పేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు కల్లాపి చల్లేందుకు గ్రామ సమీపంలో ఉన్న పశువుల కొట్టం వద్దకు మొక్కజొన్న చేను దాటి పోతుండగా పంటకు అడవి పందులు రాకుండా పెట్టిన విద్యుత్ వైర్లు ఆమె ప్రాణం తీశాయి. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని జంగమయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి కుమారుడు నరేష్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన కుంచె కిష్టమ్మ (40) ఈనెల 2న ఉదయం గ్రామ సమీపంలో ఉన్న పశువుల కొట్టం వద్ద పవుశుల పేడ తీసుకువద్దామని వెళ్లే సమయంలో మొక్కజొన్నపంటకు రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తొలగించకపోవడంతో వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఇది తెలియని ఆమె కుమారులు బంధువుల వద్దకు వెళ్లి ఉండొచ్చు అనుకుని ఉన్నారు. గురువారం ఉదయం గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొడుకు నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

రిజర్వాయర్‌లో గల్లంతైన భార్యాభర్తలు మృతి

మల్దకల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట రిజర్వాయర్‌లో మంగళవారం గల్లంతైన భార్యాభర్తలు గురువారం ఉదయం 5 గంటల సమయంలో మృతదేహాలు రిజర్వాయర్‌లో తేలాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులే మృతదేహాలను బయటకు తీశారు. స్థానిక ఎస్‌ఐ నందీకర్ కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పజె ప్తామని ఎస్‌ఐ తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అనాథలుగా మారారని, వారిని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు



చెరువు వద్ద ఉన్న గ్రామస్థులు

నవాబ్‌పేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సరదాగా చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో గల్లంతైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని దేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జావీద్(40) బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలో ఉన్న కాకర్లాల పెద్ద చెరువులోకి చేపలు పట్టేం దుకు వెళ్లాడు. అయితే ఎంతకూ రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి ఎంత వెతికినా కానరావడం లేదు. దీంతో గ్రామస్థులు అందరు కలిసి గురువారం సాయంత్రం వరకు వెతికినా కానరాలేదు. జావేద్‌కు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

బైకును తప్పించబోయి చెట్టుకు కారు ఢీ

- ఇద్దరు వ్యక్తులకు గాయాలు

బల్మూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బల్మూరు మండల పరిధిలోని గట్టుతుమ్మెన్ స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి చెట్టును కారు ఢీ కొట్టిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కటకం రఘురాం, గౌరీశంకర్‌లు అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. బైకుపై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎక్కువగా శరీర భాగాలకు గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి బల్మూరు పోలీసులు చేరుకుని స్థానికుల సహాయంతో ప్రైవేట్ వాహనాల్లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. గాయపడిన వారి తరఫున ఎవరు ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదని ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు బస్సును ఢీకొట్టిన బైకిస్టు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చంద్రబండతండా సమీపంలో ఆర్టీసీ బస్సును బైకిస్టు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గురువారం కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లింగాల నుంచి కొల్లాపూర్‌కు వస్తున్న క్రమంలో చంద్రబండతండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్(38)బైకుపై ఎదురుగా వెళ్లి బస్సును ఢీకొట్టాడు. కేతావత్ శంకర్‌నాయక్ తీవ్రంగా గాయపడి తలకు బలంగా గాయమైంది. గాయపడిన శంకర్ నాయక్‌ను హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శంకర్‌నాయక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తండావాసులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఉపాధ్యాయులు..

ఉత్తమ సేవకులు

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఆ ఉపాధ్యాయులు ఉత్తమ సేవకులుగా గుర్తింపు పొందారు. తమ పరిధిలో గల పాఠశాలలను వృద్ధిలోకి తేవడంతో పాటు విద్యార్థులకు బోధనా పరికరాలను సమకూర్చి చక్కటి విద్యనందిస్తున్నారు. పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి సేవలకు గుర్తింపుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు దక్కడం గమనార్హం. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారి సేవలపై ప్రత్యేక కథనాలు...

సొంత ఖర్చులతో పాఠశాలకు మెరుగులు



గుండుమాల్ మండలం హన్మన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



నర్సిములు

నారాయణపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని గుండుమాల్ మండలం హన్మన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దారు ఉపాధ్యాయుడు కంద్రు నర్సిములు. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 2006లో నియామకమై పాఠశాలను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. 2018లో పాఠశాలలో విధుల నిర్వహణ ప్రారంభమైంది. ఐదు తరగతులకు 61 మంది విద్యార్థులు ఉన్నారు. గామస్థుల సహకారం 45 వేలు, తోటి ఉపాధ్యాయులు నరేష్, అనంతయ్యలతో పాటు ప్రధానోపాధ్యాయుడు కొంద్ర నర్సింములు 55 వేలు స్వంతంగా వెచ్చించి పాఠశాలలు రంగులు వేయించి విద్యార్థులకు అవరసమైన అన్ని విషయాలను గోడలపై వేయించారు. మూడు తరగతి గదులు తీర్చిదిద్దారు. ప్రహరీ నిర్మించారు. 2023లో మండలస్థాయి టీఎల్‌ఎం మేళాలో తెలుగు సబ్జెక్టుకు తృతీయ బహుమతి వచ్చింది. అందరి సహకారంతో విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రధానోపాధ్యాయుడు కొంద్ర నర్సింములు తెలిపారు.

విద్యార్థుల సంఖ్యను పెంచి..



రఘురామారావు

కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంఖ్యను పెంచి విద్యాబుద్ధులు నేర్పుతూ తాను పని చేసిన పాఠశాలకు వన్నె తేవడమే ఆయన ప్రత్యేకత. వంగూరు మండలం ఉల్పర గ్రామానికి చెందిన రఘురామారావు 2010లో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. తాను పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి దాతల సహకారంతో పాటు తన కాంట్రిబ్యూషన్‌ను జమ చేసి పాఠశాలను ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా, 2024లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులను అందుకున్నారు. కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో 2013లో హెచ్‌ఎంగా చేరిన రఘురామారావు పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఉండడం, శిథిలమైన పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో తాను సుమారు ఒక లక్ష రూపాయల వరకు సొంత నిధులతో పాటు దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి పర్చారు. ప్రస్తుతం కల్వకుర్తి మండల పరిధిలోని జీడిపల్లితండాలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.



బెక్కెర ప్రాథమిక పాఠశాల అభివృద్ధిని అప్పటి కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వివరిస్తున్న హెచ్‌ఎం రఘురామారావు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తూ..

నారాయణపేట, (ఆంధ్రజ్యోతి): గత 23 ఏళ్లగా పూసల్‌పాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహణతో పదవతరగతి విద్యార్థులకు కేరీయర్ గైడెన్స్ ఇస్తూ విద్యాభివృద్ధికి తనవంతు నారాయణపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శేర్ కృష్ణారెడ్డి కృషి చేస్తున్నారు. ప్రత్యేక దినోత్సవాల్లో విద్యార్థులతో మొక్కలు నాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలకు కావల్సిన కనీస సౌకర్యాలను గ్రామస్థుల నుంచి పొందడం జరుగుతూ వస్తోంది. తన కుటుంబంలో ఎవరి పుట్టినరోజు ఉన్నా తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు పలకలు, ఆటవస్తువులు, నోట్‌బుక్స్ టీవీ, మెడికల్ కిట్స్ వితరణ చేయడం తనదైన శైలి అని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఒకసారి అప్పటి మంత్రి చిన్నారెడ్డి, మరోసారి అప్పటి కలెక్టర్ కృష్ణయ్య చేతుల మీదుగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డక ఉత్తమ బెస్ట్ అవార్డు అందుకున్నారు. వందేమాతరం ఫౌండేషన్ నుంచి ఉత్తమ అవార్డు, బసిరెడ్డిపల్లి ఎంపీపీఎస్‌కు ఉత్తమ పాఠశాల అవార్డు అప్పటి కలెక్టర్ కోయశ్రీహర్ష చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుతం దామరగిద్ద మండలం కాన్‌కుర్తి పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.



:పూసల్‌పాడ్ ట్యాలెంట్ టెస్ట్ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ (ఫైల్)

తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి..

కొల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బలోపేతం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రుంగి కృష్ణ ప్రసాద్ అహర్నిశలు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం కన్నా ముందే సొంత డబ్బులతో పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా కరపత్రాల ద్వారా వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు క్లుప్తంగా వివరించారు. ప్రైవేటుకు ధీటుగా వినూత్న ప్రచారం చేసి పాఠశా లలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెం చేలా కృషి చేశారు. తొలి రోజు ప్రభుత్వ పాఠశాలను సుందరంగా అలంకరించి విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతూ ప్రభుత్వ పాఠశాల పట్ల మక్కువ పెరిగేలా ఆయన కృషి చేశారు. అదేవిధంగా సింగోటం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉద్యో గులను సమీకరించి వారి ఆర్థిక సహాయంతో వంద మంది విద్యార్థులకు ఉచితంగా బూట్లు, సాక్సులు అందిం పజేశారు. కృష్ణ ప్రసాద్ అంకితభావం నిబద్ధత పట్ల సింగోటం గ్రామస్థులు అభినందిస్తున్నారు.



సింగోటం గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వసతులను తల్లిదండ్రులకు వివరిస్తున్న కృష్ణప్రసాద్ (ఫైల్)

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపిక



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నరసింహరావుకల్యాణిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ పాలమూరు యూనివర్సిటీ/ వనపర్తి విద్యావిభాగం/ నారాయణపేట/ జడ్చర్ల/ ధరూరు/ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్క రించుకొని ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పురస్కారానికి ఉమ్మడి జిల్లా నుంచి పలు వురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

- పాలమూరు యూనివర్సిటీలోని పీజీ కళాశాల ప్రిన్సిపాల్, మైక్రో బయోలజీ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు.
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంబీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.జగదీశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ పోలీస్ లైన్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)గా పని చేస్తున్న అబ్దుల్‌ఖలీక్ రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారం కోసం 68 మంది దరఖాస్తు చేసుకోగా 45 మందిని ఎంపిక చేసినట్లు సమాచారం.
- మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహ రావు కల్యాణి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉ పాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఆయన రాసిన కథలు దేశాంతర్, జమీన్‌కి హఖీ ఖత్, వసుధైక కుటుంబం, సాక్షరత దివస్, మౌఖిక్ అర్జీ, లోకల్ సే వోకల్, వర్చువల్ హోళీ తదతర కథ లకు బహుమతులు వచ్చాయి.
- వనపర్తి జిల్లా నుంచి ఇద్దరు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. కొత్తకోట మండలంలోని అప్పారాల ప్రభుత్వ పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న దేవన్న, శ్రీరంగాపూర్ మండలంలోని నగరాల ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న విష్ణువ ర్ధన్ నాయుడు ఎంపికయ్యారు.
- నారాయణపేట జిల్లా, కృష్ణ మండలంలోని కున్సి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న నరసింహ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపి కయ్యారు. అంతకు ముందు ఆయన కోస్గి మండలంలోని బోలువోనిపల్లి పాఠశాలలో 10 ఏళ్ల పని చేశారు.

అప్పుడు సొంత ఖర్చుతో పాఠశాల అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకున్నారు.

- జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలంలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా ప ని చేస్తున్న పి.రేవతి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక య్యారు.



మధుసూదన్ రెడ్డి, పాలమూరు



విష్ణువర్ధన్‌నాయుడు,వనపర్తి



దేవన్న, వనపర్తి



రేవతి, జాంపల్లి, ధరూర్



నర్సింహ, నారాయణపేట

ఉమ్మడి జిల్లాలోనే విజయ గణపతి లడ్డూకు అత్యధిక ధర

కోస్గి సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కోస్గి విజయ గణపతి లడ్డూ అత్యధిక ధర పలికింది. గురువారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో నిమజ్జన ఉత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా చేపట్టిన లడ్డూ వేలంపా టలో విజయగణపతి మంటపం మున్నూర్‌వాడ సభ్యులు పోటాపోటీగా పాడగా లడ్డూ అత్యధిక ధర పలికింది. రూ.13 లక్షలు పలికి జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచింది.

కాగా గత సంవత్సరం రూ. 11లక్షలతో ఇదే బృందం ముందంజలో ఉండగా, ఈ ఏడాది కూడా ఇదే బృందం దక్కిం చుకుంది.

ఫైర్‌స్టేషన్లు మండల స్థాయికి విస్తరించాలి

- జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక డీపీఆర్
- రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



జడ్చర్లలో అగ్నిమాపక కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక కేంద్రాలు మండల స్థాయికి విస్తరించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మెడికల్, పోలీసు శాఖల మినహ ఇతర ప్రాణ, ఆస్తులకు నష్టం వాటిల్లకుండా అగ్నిమాపక సిబ్బంది సేవలు అందిస్తారన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలో వేర్వేరుగా నూతనంగా నిర్మించిన జడ్చర్ల అగ్నిమాపక కేంద్రం నూతన భవనం, సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని గు రువారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక డీపీఆర్ రూపొందించి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అండగా నిలిచాడని, పరిహారం అందించేందుకు రూ.450కోట్ల నిధులను మంజూరీ చేయించి, నిర్వాసితుల ఖాతాలో జమ చేయించాడన్నారు.

స్వశక్తితో ఎదగడానికి ధైర్యం ఇచ్చేందుకు సెట్విన్ శిక్ష ణ కేంద్రం ఎంతో దోహదపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో చేపల పెంపకంకోసం రూ.123 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని, అందులో రూ.84కోట్లు చేపలకు, రూ.39కోట్లు రొయ్యల పెంపకంకు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగ, ఉపాధికి సెట్విన్ శిక్షణ దోహదం

నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధికి సెట్విన్ శిక్షణ కేంద్రం ఎంతో దోహదపడుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరు ధ్‌రెడ్డి అన్నారు. సాంకేతిక నైపుణ్యం లేని కారణంగా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలలో ఉద్యోగ అవకాశం కల్పించడం లేదని, సెట్విన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశం లభిస్తుందన్నారు. సెట్విన్ శిక్షణ కేం ద్రంలో శిక్షణ అందించేందుకు ప్రతి మూడు నెలలకు అయ్యే రూ.4 లక్షల 50వేలను స్వంతంగా వెచ్చిస్తున్నానని వెల్లడించారు.

రూ.20లక్షలు స్వంత నిధులతోనే భవనాన్ని ఆధునీకరించి నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీజీ నాగిరెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ఆర్డీవో నవీన్, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కొనసాగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు

- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. శ్యామ్‌సుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-13 బాల,బాలికల బ్యాడ్మింటన్ టోర్నీకి సంబంధించిన క్వాలిఫయింగ్ రౌండ్ 200 మ్యాచ్‌లు గురువారం జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మెయిన్ డ్రాకు అర్హత పొందారు. రాష్ట్ర స్థాయి అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌న గర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుంద ర్‌గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రా ష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీ బీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్ తెలిపారు. నాలుగు కోర్టుల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఈ నెల 7న టోర్నీ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

జడ్చర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రేషన్‌దుకాణంలో బియ్యం తీసుకురావడానికి వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెల గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించిన సంఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలో చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... కావేరమ్మపేటలోని ఫ్రీజన్‌కాలనీకి చెందిన గోద నాగలక్ష్మి అనే మహిళ కావేరమ్మపేట పోస్టాఫీసు సమీపంలోని రేషన్‌దుకాణం వద్ద బియ్యం తీసుకుని ఇంటికి వెళ్తుంది. ఇదే సందర్భంలో కావేరమ్మపేట ఫ్లైఓవర్ అండర్‌పాస్ వద్ద ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై కూర్చుని ఉండగా, మరో వ్యక్తి వెనక వచ్చి నాగలక్ష్మి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల గొలుసును తెంపుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి



చిన్నలక్ష్మన్న(ఫైల్)

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలు రైతులకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉండవల్లి మండల పరిధిలోని మారమునగాల గ్రామంలో దెబ్బతింటున్న పంటలను చూస్తూ దిగాలు చెందుతూ ఓ రైతు గుండెపోటుతో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రా మానికి చెందిన బోయ చిన్న లక్ష్మన్న అనే రైతుకు సెంటు భూమి లేకున్నా కౌలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ ఏడాది గ్రామంలో ఎకరం రూ.18వేల నుంచి రూ.25వేలు వెచ్చించి 20 ఎకరాల పత్తి, 6ఎకరాల మిర్చి, 2 ఎకరాల ఉల్లి సాగు చేశాడు. ఉన్నట్టుండి ఎడతెరిపిలేని వర్షాలు కురవడంతో పైపంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పత్తి, మిరప వరద నీటిలో మునిగిపోయి దెబ్బతిన్నాయి. దీంతో గత రెండు వారాలుగా దిగాలు చెందుతూ ఉన్నాడు. గురువారం ఉల్లిపంటలో కలుపు తీయించేందుకు కూలీలను రప్పించి పొలానికి వెళ్లాడు. కూలీలు పని చేస్తుండగా కాసేపటికే గుండె నొప్పి అంటూ ఇంటికి వచ్చాడు. మిత్రుడి సాయంతో కర్నూలు ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లాడు. చికిత్స పొందుతూ.. మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య వీరేశ్వరమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఇంటర్వ్యూ..

మండల రైతులకు సరిపడా యూరియా

- రమేష్, మండల వ్యవసాయాధికారి



ఉప్పునుంతల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల రైతులకు సరిపడా యూరియా ఉంది రైతులు అధైర్యపడవద్దని మండల వ్యవసాయాధికారి రమేష్ అన్నారు. సహనం పాటించి యూరియా కేంద్రాల వద్ద రైతులు యూరియా బస్తాలు తీసుకోవాలని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

మండలంలో వానాకాలంలో ఏఏ పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు ?

పత్తి పంట 22,580 ఎకరాలు, వరి 9,150 ఎకరాలలో సాగైంది. మరో 1500 వందల వరకు సాగు పెరిగే అవకాశం ఉంది. మొక్కజొన్న 1,150 ఎకరాలు, కందులు 350 ఎకరాలు, జొన్నలు 150 ఎకరాలలో సాగు చేశారు.

ఇప్పటి వరకు మండలానికి ఎంత యూరియా వచ్చింది

గతేడాది ఆగస్టు నెలలో 7,711 బస్తాలు వస్తే ఈ సంవత్సరం ఆగస్టు నెల వరకు 11,312 బస్తాల యూరియా వచ్చింది

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటాయా ?

వర్షపు నీరు పంట పొలాల్లో ఎక్కువగా నిలువ ఉంటే మొక్కలు వేరు కుళ్లు తెగులు సోకే అవకాశం ఉంటుంది. కాబట్టి దీని నివారణ కోసం కాపర్ ఆక్సిక్లోరైడ్, లేక మ్యాన్కోజబ్ కలిపి 30 ఎంఎల్ చొప్పున మొక్కకు పిచికారి చేసుకోవాలి.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యే ఫోన్ కాల్‌తో తీరిన తాగునీటి కొరత

మన్ననూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పది రోజులుగా మన్ననూరు గ్రామంలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా ఈ విషయాన్ని ఉమామహేశ్వర పాలక మండలి డైరెక్టర్ సంభుశోభ ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి, తక్షణమే నీటి సరఫరా చేయాలని ఆదేశించడంతో రెండు గంటలలోపే నల్లాల ద్వారా నీటి సరఫరా చేశారు. ఎమ్మెల్యే స్పందించి తాగునీటి పరిష్కరించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు సాదిక్ పాషా

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం రేషన్ డీలర్ల కనీస గౌరవ వేతనం రూ.5 వేలు చెల్లించి కమీషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.సాదిక్ పాషా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బియ్యం కమీషన్ 5 నెలల పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించే కమీషన్‌ను వేర్వేరుగా కాకుండా ఒకే కమీషన్‌గా చెలించాలని కోరారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం నేడు రాష్ట్ర వ్యాప్త రేషన్ దుకాణాల బంద్‌కు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

పత్తిపంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చారకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు వేసిన పత్తి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో వంశీ అన్నారు. గురువారం మండంలోని అగ్రహారంతండాలో రైతులు వేసిన పత్తిపంటను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంటకు ఎర్రనల్లి, తామర, పేనుబంక దోమల ఉధృతి ఎక్కువగా ఉండడం గమనించి నట్లు ఆయన పేర్కొన్నారు. వాటి నివారణకు ఫిప్రోనిల్, హెక్సీతియజోక్స్ కాంబినేషన్‌లో ఉన్న మందును నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా పత్తికాయమచ్చ, దోమ, నల్లి నివారణకు ఏఏ మందులు పిచికారి చేయాలో తెలిపారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

వృద్ధుడి అదృశ్యం

కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తిలో తండ్రిపై కొడుకు దాడి చేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కల్వకుర్తి పట్టణంలోని వాసవి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బాలయ్య(70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా బాలయ్య బుధవారం పొలానికి వెళ్లాడు. ఆయన కుమారుడు బీరయ్య అక్కడికి కారులో వెళ్లాడని సమాచారం. ఆ తర్వాత బాలయ్య కన్పించకపోవడంతో బుధవారం అతని సోదరుడు మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామగిరికి చెందిన రామకృష్ణ(30) భార్యతో తరచుగా గొడవ పడేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేనిదిచూసి అతను ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన చిన్న కుమారుడు గుర్తించి తల్లి రజితకు సమాచారం అందించాడు. బంధువులు నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని, గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కందనూలు : మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ గీతాంజలి

అచ్చంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగ వారిలో అచ్చంపేట డివిజన్‌లో బల్మూరు అచ్చంపేట, లింగాల, అమ్రాబాద్ మండలాలకు చెందిన 8మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి సహచర ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణవేణి ఎంపిక



కొల్లాపూర్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కొల్లాపూర్ పట్టణవాసి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని ఎంపికయ్యారు. నార్లాపూర్ గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమెను ఎంఈవో ఇమ్మాన్యుయేల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కురుమయ్య మండల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

కందనూలు : జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తాలో గల ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ కావ ర్స్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కే.గీతాంజలి ఆధ్వర్యంలో అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర ప టానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయ దినోత్సవం

బల్మూరు : మండల పరిధిలోని కొండనాగుల శ్రీఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ రవిఫిరంగి అధ్యక్షతన జరుపుకు న్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆర్.వెంకటయ్య, బి.జాన్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

తిమ్మాజిపేట : ప్రతి ఏటా 10లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని విద్యార్థులను ప్రోత్సహించడమే సంఘం లక్ష్యమని నాయకులు జుట్టు ఉత్తరయ్య, జన్ను వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని గొరిట, జడ్పీహెచ్ఎస్‌లో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. డిప్యూటీ డీఈవోగా పని చేసిన పదవీ విరమణ పొందిన గ్రామానికి చెందిన తుమ్మల భాస్కర్, ఉపాధ్యాయులు కొండారెడ్డి, శేఖర్‌రెడ్డిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



కొండనాగుల డిగ్రీ కళాశాలలో..

● చారకొండ : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ మండల ప్రసిడెంట్ గణేష్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు గ్రీటింగ్స్ కార్డులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని మార్గదర్శి విద్యాలయంలో గురుపూజోత్సవం పురస్కరించుకొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమామహే శ్వర పాలకమండలి డైరెక్టర్ సంభుశోభ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు జూలూరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు సునంద, కృష్ణయ్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిమజ్జనం



తాడూరు : ఐతోల్ గ్రామంలో గణనాథున్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కొల్లాపూర్/ తాడూరు/ తెలకపల్లి/ పెద్దకొత్తపల్లి/ పెంట్లవెల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిగింది. విగ్రహాల వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. బాజా భజంత్రీలు, బ్యాండ్ మేళాలతో గణనాథుల శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల ఉత్సాహం, సాంస్కృతిక ప్రదర్శనలతో వినాయకుని నిమజ్జనోత్సవంతో పట్టణమంతా సందడి కనిపించింది. భారీ గణనాథులను సోమశిల కృష్ణానదికి, చిన్నవి నాగర్ పట్టణం సమీపాన నాగనూలు చెరువుకు తరలించారు. కొల్లాపూర్‌లో గురువారం గణనాథులను నిమజ్జనం చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని బండాయగుట్ట వెంకటేశ్వర యువక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథునికి పట్టణ మాజీ మునిసిపల్ కౌన్సిలర్ నరసింహారావు చివరి పూజలు చేసి నిమజ్జనం రథోత్సవాన్ని ముందుకు నడిపారు. తాడూరు మండలంలోని గ్రా మాల్లో నిమజ్జనం చేశారు. తెలకపల్లి మండల పరిధిలోని రాకొండలో బుధవారం రాత్రి స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల భరతనాట్య కార్యక్రమంలో అలరించింది. పెద్దకొత్తపల్లిలోని కురువ వాడలో కురువ గణేష్ యువక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని ఘనంగా నిమజ్జనం చేశారు. నాయకులు పాల్గొన్నారు. పెంట్లవెల్లి విఘ్నేశ్వరుడికి పూజలు కొనసాగుతున్నాయి.

కొల్లాపూర్‌లో ఘనంగా గంధోత్సవం



కొల్లాపూర్‌లో గంధోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

కొల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం సోదరుల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో గురువారం సాయంత్రం జామే మసీద్ నుంచి గంధం బయలుదేరగా, పట్టణంలో ముస్లిం సోదరులు ఊరేగింపు నిర్వహించారు. గురువారం రాత్రి జామే మసీదులో మత పెద్దల సమక్షంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్టణ ముస్లిం సోదరులు ఏర్పాట్లు నిర్వహించారు. కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు హాషీమ్, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజాచౌష్, సభ్యులు పర్వేజ్, మత పెద్దలు జాఫర్ సాబ్, మహబూబ్ అలీ, రుక్నద్దీన్, బాబు జానీ, మహబూబ్ అలీ, ఖాజా, మోసిన్, అజారుద్దీన్, తన్వీర్, యువకులు పిల్లలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెలే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో గురువారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు పాల్గొన్నారు. హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన లడ్డూ వేలంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి 3.99లక్షలకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. పట్టణంలోని పలు గణనాథుల వద్ద ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేసి, మాట్లాడారు. మండపాల నిర్వాహకులు ఉన్నారు.

గణనాథులకు వీడ్కోలు

9 రోజుల పాటు నిత్య పూజలందుకున్న గణనాథులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధల తో నిమ జ్జనానికి తరలించారు. కల్వకుర్తి పట్టణంలో వాడవాడలా ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద సాయంత్రం నుంచి నృత్యాలు, పాటలు అలరించాయి. మహిళల దాండీయాలు ఆకట్టుకున్నాయి. గణనాథులను పట్టణంలోని ఎర్రకుంటలో నిమజ్జనం చేశారు. మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఐ బి.నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు పర్యవేక్షించారు. వివిధ పార్టీల నాయకులు, మండపాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జనం ఎర్రకుంట వద్ద మహిళల బతుకమ్మలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన ఎల్ఐసీ వార్షికోత్సవాలు



కిశోర్‌ను సన్మానిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో భారతీయ జీవిత బీమా సంస్థ 69వ వార్షికోత్సవం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కార్యాలయంలో బ్రాంచ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ కిశోర్‌ను ఎల్ఐసీ ఏజెంట్ల బృందం సభ్యులు శాలువాల, పూల మాలలతో సత్కరించారు. ప్రతి ఒక్కరు ఎల్ఐసీ పాలసీ తీసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఏడీఎం చంద్రశేఖర్, ఏబీఎం రాజబాబు తదితరులు ఉన్నారు.

తప్పుడు ఆరోపణలు మాని ప్రజలకు సేవ చేయండి

- మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్

బిజినేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారు, ప్రజా సమస్యల కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ప్రజల తరఫున ప్రశ్నిస్తే కొందరు స్థాయికి మించి చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకొని ప్రజలకు సేవలు చేయాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి ఇంట్లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా ఇవ్వడం చేతకాక మాజీ ఎమ్మెల్యే మర్రిపై తప్పుడు విమర్శలు చేస్తూ యూరియా సమస్య నుంచి ప్రజల దృష్టి మరలించేందుకు కొందరు కాంగ్రెస్ మండల నాయకులు తమ స్థాయి మరిచి ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ మండల రైతు బంధు అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పం చులు సురభి మహేష్‌రావు, జుర్రు కృష్ణ, అల్లోజీ, ఊశన్న, రాఘవులు, ఎల్లస్వామి, మాజీ ఎంపీటీసీలు చీర్లం బాలస్వామి, తిరుపతయ్య, ఆంజనేయులు, మండల నాయకులు ఉన్నారు.

అక్రమ అరెస్టులతో రైతాంగ పోరాటాలు ఆగవు

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులతో రైతాంగం పక్షాన పోరాటాలని ఆపలేదని భారతీయ కిసాన్ సంఘ్ (బీఎస్‌కే) జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అంజన్ రెడ్డి హెచ్చరించారు. బీఎస్‌కే కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు విట్టల్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా బీఎస్‌కే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజన్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతాంగానికి జరిగిన పంట నష్టం, ఎరువుల కొరతపై ముఖ్యమంత్రి కామారెడ్డి జిల్లా పర్యటనలో నిలదీసిన ఆ జిల్లా అధ్యక్షుడిని అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. రైతాంగం పక్షాన బీఎస్‌కే నిరతరం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎస్‌కే జిల్లా కార్యదర్శి గండ్ల చంద్రయ్య, నాయకులు అశోక్‌రెడ్డి, దాసరి బాలస్వామి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, విజయ్‌కుమార్, పోలీసు కృష్ణయ్య, శరబంద, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోలేని ప్రభుత్వం

- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ హనుమంతరావు

తెలకపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులను ఆదుకోని ప్రభుత్వం రాష్ట్రంలో ఉండి కూడా దండగేనని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు యూరియా కోసం నానా అగచాట్లు పడుతున్నారని, వారి గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నీళ్ల నిధుల నియామకాల అనే ఉద్దేశంతో ముందుకు వెళ్లిందని దానికి అనుగుణంగానే కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై విమర్శలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దపల్లి బంగారయ్య, మాజీ ఉపసర్పంచ్ కృష్ణయ్య, భాషమౌని రాములు, పర్వతాలు, లక్ష్మారెడ్డి నరసింహులు, సుందర్‌రెడ్డి, రమేష్, సత్యనా రాయణ, శ్రీనివాసులు, శివశంకర్ ఉన్నారు.

ఘనంగా సత్యసాయి గ్రామోత్సవం

వెల్దండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి గ్రామోత్సవం నిర్వహించారు. సత్యసాయి భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కల్వకుర్తి సత్యసాయి సేవా సమితి అనుబంధ భజనమండలి ఆధ్వర్యంలో మహిళలు సత్యసాయిని పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుబ్బ శంకరయ్య, ఆధ్యాత్మికత సమన్వయకర్త రవీంద్రాచారి, వెంకటేష్, లక్ష్మణ్, భూపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్ ఉన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ క్యాంపు

కందనూలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఈ నెల 10న జర్నలిస్టుల కోసం హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయ్, సురేష్ తెలిపారు. విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్, వెంకటస్వామి, సందు యాదగిరి, బొడ్డుపల్లి మల్లేష్ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



కొల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుఅన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని ఒకటో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మంత్రి అందించారు. అదేవిధంగా ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలకు ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా కేటాయించలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గృహ నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా 16,17వ వార్డుల్లో మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. పలు చోట్ల ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు, హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరసింహారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులుకు ఘన సన్మానం



ప్రమోషన్ పొందిన ఆర్.శ్రీనివాసులును సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్

కందనూలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల నియంత్రణలో ఎంపీహెచ్‌ఈవో ఆర్.శ్రీనివాసులు సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలో అసిస్టెంట్ మలేరియా అధికారిగా విధులు నిర్వహించిన ఆర్.శ్రీనివాసులు ఉద్యోగోన్నతి పొంది వనపర్తి జిల్లాకు బదిలీ అవుతున్నారు. అదే క్రమంలో లింగాల మండలం బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్‌ఈవోగా పని చేసిన వై.శ్రీనివాసులు ప్రమోషన్‌పై నాగర్‌కర్నూల్ డివిజన్‌కు వచ్చిన సందర్భంగా గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో నరసింహ, ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలాజీ, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ సురేష్‌కు మార్, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, టీహబ్ మేనేజర్ గౌస్, కల్యాణ్, రమేష్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థాయికి మించి విమర్శలు చేయొద్దు

- బీజేపీ నాయకులకు హితవు పలికిన కాంగ్రెస్ నాయకులు



ఊర్కొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఊర్కొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థాయికి మించి విమర్శలు చేయవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డిలు బీజేపీ నాయకులకు హితవు పలికారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం బీజేపీ నాయకులు నిర్వహించిన పాదయాత్రలో మాట్లాడిన విధానాన్ని తప్పు పట్టారు. రాచాలపల్లి- మాదారం రోడ్డు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలల్లోనే బీటీ రోడ్డు మంజూరు కావడంతో పాటు కాంట్రాక్టర్ టెండరు పొంది వర్షాకాలం అయినందున వెంటనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తారని తెలిపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే, ముఖ్యమంత్రిని విమర్శిస్తే గొప్పనాయకులు అవుతారని ఊహల్లో విహరించడం మాని, పదేళ్లలో మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేకు నమ్మినబంటుగా ఉండి రోడ్లు, అభివృద్ధి ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. పార్టీ మారి ప్రగల్భాలు పలుకడం కాదని, గెలిచినా, ఓడినా ఒకే పార్టీలో ఉండి పోరాటాలు చేయాలని సూచించారు. సమావేశంలో ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారి ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు ఆరిఫ్, బంగారయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- అవగాహన సదస్సులో ఎస్ఐ కే.శ్రీనివాస్



పాలెంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ కే.శ్రీనివాస్

బిజినేపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కే.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని పాలెంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో వేధింపులకు గురిచేసిన, గాయపర్చినా యాంటి ర్యాగింగ్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేస్తే జీవితాంతం బాధపడాల్సి ఉంటుందన్నారు. తోటి విద్యార్థులతో స్నేహంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చరణ్ తేజ, టీచింగ్ అసోసియేట్ గాడి పార్వతి, సంతోషిణి, విద్యార్థులు ఉన్నారు.

గోదాముల చుట్టూ తిరుగుతున్న రైతులు

- సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎండీ సమద్‌పాషా



మాట్లాడుతున్న సింగిల్ విండో మాజీ చైర్మన్ సమద్‌పాషా

తాడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా అన్నదాతలకు సరిపడా యూరియా అందకపోవడం మూలంగా వ్యవసాయ పనులు వదులుకుని గోదాముల చుట్టూ యూరియా కోసం తిరుగుతున్నారని సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎండి.సమద్ పాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో హాలుల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలగౌడ్ మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసుకుందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కకు పెట్టి అన్నదాతలను యూరియా కోసం ఇబ్బందులకు గురి చేస్తున్న దని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తిరుపతిరెడ్డి, మశ న్న, పర్వతాలు, శేఖర్‌గౌడ్, బాలకృష్ణ, రాజుగౌడ్, కృష్ణయ్య, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్



ఐఎంబీ ఎయిడెడ్ పాఠశాలను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని బీఎస్పీ జి ల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. గురువారం బీఎస్పీ ఆధ్వ ర్యంలో జిల్లా కేంద్రంలోని ఐఎంపీ ఎయిడెడ్ పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో అధికారుల పర్యవేక్షణ కరువై విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అంద డం లేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంబీ పాఠశాలలో ఒకప్పుడు 500 నుంచి 600 మంది విద్యార్థులు ఉండేవారని ప్రస్తుతం 22 మంది విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కళ్యాణ్, నాయకులు రాంచందర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు.